నేడు ఫీవర్ ఆస్పత్రిలో ప్రపంచ ఫార్మాసిస్ట్స్ డే వేడుకలు

హాజరు కానున్న మంత్రులు దామోదర, పొన్నం

బర్కత్‌పుర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మాసిస్ట్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో ఫార్మాసిస్ట్స్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్, కోశాధికారి జి.యాదయ్య తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ వేడుకలను ఫీవర్ ఆస్పత్రి ఆడిటోరియంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

లైబ్రరీ వద్ద విస్తృత పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ విద్యార్థులు చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో ఆందోళనకు దిగుతారన్న సమాచారంతో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చిక్కడపల్లి పోలీసులు విస్తృతపోలీసు బందోబస్తు నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో అప్పటికే నిరుద్యోగ విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిన క్రమంలో లైబ్రరీలో కూడా ఆందోళన చేయాలని నిర్ణయించినట్లు సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఒక్కసారిగా మధ్యాహ్నం పోలీసులు రెండు వ్యాన్ల ద్వారా లైబ్రరీకి చేరుకున్నారు. ఎలాంటి ఆందోళన జరగకుండా జాగ్రత్తలు పాటించారు. అదే విధంగా అశోక్‌నగర్ చౌరస్తాలో కూడా విస్తృత బందోబస్తు కొనసాగింది.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

నల్లకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతియేటా ఆర్థిక సహకారం అందించనున్నట్లు శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ సంస్థ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు వెల్లడించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కోశాధికారి, శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మంత్రి సునీల్ జయంతిని పురస్కరించుకుని బుధవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో దివ్యాంగుడైన సీనియర్ జర్నలిస్టు అక్కినేపల్లి పురుషోత్తమరావుకు రూ.10 వేల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ప్రధానకార్యదర్శిగా దివంగత మంత్రి సునీల్ మాతృమూర్తి ప్రముఖ రచయిత్రి మంత్రి లీలాబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

మహిళా ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం : ఎమ్మెల్యే


మెగా హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, డాక్టర్ అవంతి

కవాడిగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మహిళలు ఆర్యోగంపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. బుధవారం కవాడిగూడ లోయర్‌ట్యాంక్ బండ్‌లోని డీబీఆర్‌మిల్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యాక్రమంలో భాగంగా మహిళా మెగాహెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, హెల్త్‌సెంటర్ డాక్టర్ అవంతి, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్యం బాగుంటేనే భవిష్యత్ బంగారుమయం

కవాడిగూడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల్యం బాగుంటేనే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. బుదవారం కవాడిగూడ డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అన్నప్రసన్న, గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాల, టీచర్లు ధనమ్మ, సంతోషిణి, కవిత, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. మహిళా పొదుపు సంఘాలు స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాలను సద్వినియోగంచేసుకుని సకాలంలో వాటిని చెల్లించాలని అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ డాక్టర్ చారీ వీధిలోని శ్రీమహిళా పొదుపు సంఘం సభ్యులకు రూ.15 లక్షల చెక్కును డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.మురళీయాదవ్, శ్రీమహిళా పొదుపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కుల దురహంకార దాడులపై పోరాడుదాం'

నల్లకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి జి.ఝాన్సీ పేర్కొన్నారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో 153వ సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు శివబాబు, మహేందర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, పీడీఎస్‌యు జాతీయనాయకులు పి.మహేష్, నాయకులు పి.నాగరాజు, యాదన్న, సత్యనారాయణ, మంద నవీన్, కె.శ్రీనివాస్, ఆసిఫ్, గడ్డం గౌతమ్, తీగల శ్యామ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'అగ్రగామిగా ఎదిగిన ఆదర్శ మ్యాట్రిమోని'

చిక్కడపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విదేశీ వివాహ సంబంధాలు(ఎన్ఆర్ఐ)ను అత్యధికంగా కుదర్చడంలో ఆదర్శ స్వచ్ఛంద సంస్థ అగ్రగామిగా నిలిచిందని ఆ సంస్థ అధినేత వంగాల బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసి 31 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గౌతులచ్చన్న, టి.బాలాగౌడ్ చేతులమీదుగా ప్రారంభించిన ఆదర్శ సంస్థ అంచలంచెలుగా ఎదుగుతోందన్నారు. అన్ని కులాలవారికి ఇప్పటివరకు 4 వేలకుపైగా పెళ్లిళ్లు కుదిర్చినట్లు వెల్లడించారు.

జీవో 190లో స్థానికతపై ప్రభుత్వం స్పందించాలి


చిక్కడపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవో 190లో స్థానికతపై ప్రభుత్వం స్పందించాలని 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ విజయ్‌కుమార్, సెక్రటరీ జనరల్ నాగేశ్వరరావు కోరారు. జీవో నెంబర్ 317 ఉద్యోగ ఉపాధ్యాయ బాధితులకు తాత్కాలిక డిప్యూటేషన్లకై ఉపశమనం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోనెంబర్ 190ను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు జీవో 317 జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27న చలో హైదరాబాద్ పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు ఐలయ్య, స్వప్న, జ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏఎన్ఆర్ పాటకు పట్టాభిషేకం

చిక్కడపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన నీలాల గగనాన నిండిన వెన్నెల శీర్షికతో ఏర్పాటు చేసిన ఏఎన్ఆర్ పాటకు పట్టాభిషేకం కార్యక్రమం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. డా.అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి వంశీ సంస్థల అధినేత డా.వంశీరామరాజు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటీమణి, సుడిగుండాలు ఫేమ్ డా.ఆర్.ప్రసన్నరాణికి వంశీ-ఏఎన్ఆర్ నటనా పురస్కారాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.


గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో లలితాదేవిగా అమ్మవారు దర్శనం


కవాడిగూడలో గాయత్రిదేవిగా కనకాల కట్టమైసమ్మ అమ్మవారు


బతుకమ్మకుంటలో అన్నపూర్ణాదేవిగాఅమ్మవారు


అంబర్‌పేట మహాకాళి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనం


భోలక్‌పూర్ రంగానగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు పూజలు చేసిన బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు తదితరులు

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనం


భోలక్‌పూర్ భవానీ శంకర ఆలయంలో మహిళలు లలిత పారాయణం


ముషీరాబాద్ ఆశీర్‌ఖానా వద్ద పూజలు అందుకుంటున్న దుర్గామాత

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలను నిర్వహించారు. అమ్మవారు జైస్వాల్‌గార్డెన్‌కాలనీలో శ్రీలలితాదేవిగా, కవాడిగూడలోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో గాయత్రీదేవిగా, ముషీరాబాద్, అంబర్‌పేట శ్రీమహాకాళి, బతుకమ్మకుంటలోని మైసమ్మ, చిక్కడపల్లిలోని ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. చిక్కడపల్లి, ముషీరాబాద్, గోల్నాక, రాంనగర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

- చిక్కడపల్లి, ముషీరాబాద్, గోల్నాక, రాంనగర్, బర్కత్‌పుర, నల్లకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)


దోమలగూడలో అన్నదానం చేస్తున్న హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆలయ చైర్మన్ టి.రవీందర్, కార్పొరేటర్ జి.రచనశ్రీ తదితరులు


జెమినీ కాలనీలో దుర్గామాతకు పూజలు చేసిన బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, నిర్వాహకులు మహేష్, నరేష్, సందీప్, శివ, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి


జైస్వాల్‌గార్డెన్ కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు


జైస్వాల్‌గార్డెన్ కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయంలో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు


కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో చండీహోమం


అడ్వకేట్స్ కాలనీలో బాలత్రిపుర సుందరీ దేవికి పూజలు చేస్తున్న దత్తాత్రేయ



నింబోలిఅడ్డలో టీమ్ అలంకిత నిర్వహించిన మాతా జాగరణ వేడుక


లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ చైర్మన్


అంబర్‌పేట మహాకాళి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్ దంపతులు


ముషీరాబాద్ మహాకాళి దేవాలయంలో అన్నపూర్ణ దేవికి పూజలు చేసిన ప్రధాన అర్చకులు చంద్రమౌళి, ఈవో మహేందర్ కుమార్ తదితరులు


గంగపుత్ర కాలనీలో దుర్గామాతకు పూజలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవింద్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు


ముషీరాబాద్ కమలానెహ్రూనగర్‌లో దుర్గామాతకు పూజలు చేసిన బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ తదితరులు


చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనం

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


తెలంగాణ సగర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాటులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, తదితరులు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, వివిధ పార్టీలు, వివిధ సంఘాల మహిళా నాయకులు పాటలు పాడుతూ.. ఆడుతూ.. ఆనందంగా గడిపారు.
-ముషీరాబాద్/రాంనగర్/కవాడిగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి):


బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్ ప్లాజాలో జరిగిన బతుకమ్మ సంబరాలకు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డిల నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు బస్సులో తరలివెళ్లారు.


వాసవి మహిళా సంఘం, చిక్కడపల్లి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వాసవి మహిళా సంఘం చిక్కడపల్లి అధ్యక్షులు దిడిగం శైలజ తదితరులు


సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద స్వేచ్ఛ, సమానత్వం స్వాభిమాన బతుకమ్మ ధూం ధామ్‌లో పాల్గొన్న మహిళలు


ముషీరాబాద్ నుంచి పీపుల్‌ప్లాజాలో బతుకమ్మ ఆడేందుకు తరలివెళ్తున్న మహిళల ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీధర్‌చారి


బతుకమ్మలతో మోహన్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న మహిళలు, బీఆర్ఎస్ నాయకులు


డా.బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

వీహెచ్ఆర్ అంబర్‌పేట జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌గా నామకరణం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్లే గ్రౌండ్ అసోసియేషన్ అధ్యక్షుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, కార్యదర్శి సద్గురు, ఉపాధ్యక్షులుధనుంజయగౌడ్

గోల్నాక, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ప్రజలకు, యువతకు ఇంత పెద్ద అంబర్‌పేట జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్ ఉండడానికి ప్రధాన పాత్రధారుడైన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేరుతో వీహెచ్ఆర్ అంబర్‌పేట జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌గా నామకరణం చేయాలని అంబర్‌పేట ప్లేగ్రౌండ్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం అంబర్‌పేట జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ అసోసియేషన్ కార్యదర్శి నాన సద్గురు, ఉపాధ్యక్షులు పంజాల ధనుంజయ గౌడ్, వై.శంకర్‌గౌడ్, ఎస్.అరవింద్‌గౌడ్, ప్రతినిధులు యాదయ్య, కుమార్ తదితరులతో కలిసి మాట్లాడారు. అంబర్‌పేట యువత క్రీడాకారులుగా రూపొందడానికి, ప్రజలు ఉత్సవాలు జరుపుకోవడానికి ఈ గ్రౌండ్ ఎంతగానో దోహద పడుతుందన్నారు. 26న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించబడుతున్న బతుకమ్మ కుంట కార్యక్రమానికి ప్రజలు, మహిళలు తరలిరావాలని వారు కోరారు.

'హైడ్రా కమిషనర్‌కు కోర్టు పట్టింపు లేదు'

రాంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట స్థలంపై హైడ్రా కమిషనర్ రంగానాథ్‌కు కోర్టు అంటే పట్టింపు లేదని, సదరు అధికారి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం అంబర్‌పేట ఛేనెంబర్ చౌరస్తాలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై కంటెంట్ కూడా వేయడం జరిగిందన్నారు. కోర్టు తనకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రాపర్టీకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ కోర్టు ఆర్డర్స్ కూడా తన వద్ద ఉన్నాయని ఆయన తెలిపారు.

ప్రపంచమంతా అక్కినేని ఖ్యాతి

చిక్కడపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్కినేని ప్రపంచమంతా గుర్తుపెట్టుకునేంత ఖ్యాతిని గడించారని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ.రమణాచారి అన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుగ్రహీత అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖులు రేలంగి నరసింహారావు, జె.చెన్నయ్య, పొత్తూరి సుబ్బారావు, బొప్పన నరసింహారావు, రామరాజులక్ష్మీశ్రీనివాస్, కామేశ్వరరావు, రాంబాబులకు పురస్కారాలను బహూకరించి సన్మానించారు. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.

భోలక్‌పూర్‌లో రోడ్లను ఆధునికీకరించాలి

ముషీరాబాద్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని దేవీచౌక్, గాంధీనగర్‌లో రోడ్లు అధ్వానంగా మారాయని వాటిని వెంటనే ఆధునికీకరించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు అధ్వానంగా మారడం వల్ల పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని ఆయన స్పందించి ఉన్నతాధికారులను ఆదేశించినా నేటికీ రోడ్లు వేయడం లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మసూద్

ముషీరాబాద్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మసూద్ పేర్కొన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు అన్నారు. రాబోయే జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జఫీర్‌ఉద్దీన్, గాంధీనగర్ ఇన్‌చార్జి శంకర్, నాయకులు, హుస్సేన్, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా మురళి

రాంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన అధికారికంగా చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నది. ఈ ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు ముదిగొండ మురళి నియమితులయ్యారు.

నేడు ఎంఆర్‌పీఎస్ కృతజ్ఞత సభ

ముషీరాబాద్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం కృతజ్ఞత సభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంఆర్ఎస్ నగర నాయకుడు వెంకటేష్ మాదిగ కోరారు. బుధవారం ముషీరాబాద్‌లోని సంజీవ్‌రెడ్డి నగర్, రంగానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బాలకృష్ణ, శ్రీనివాస్, రఘునాథ్, విజయ్, దాస్, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొడవ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

బర్కత్‌పుర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ నింబోలిఅడ్డలో పక్కపక్క ఇంట్లో నివసిస్తున్న వారు చిన్న విషయంపై జరిగిన గొడవలో నాంపల్లి కోర్టు ఇద్దరు ముద్దాయిలకు 3 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించిందని కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. 2017లో నింబోలిఅడ్డలో నివసిస్తున్న రెండు వర్గాలు గొడవ పడ్డాయి. దీనిపై ఆనాడు పోలీసులు నిందితులపై 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ బుధవారం జరిగింది. ఇద్దరికి నాంపల్లి 4వ ఏసీజేఎం కోర్టు జడ్జి మూడు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ఏ 3 నిందితుడు ఇటీవల చనిపోగా మిగత 8 మందికి కోర్టు రూ.1000 జరిమానా విధించిందని అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

బర్కత్‌పుర: ఇంటి నుంచి దేవాలయానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైందని కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న శంకర్ సతీమణి టి.జయశ్రీ(70) బుధవారం దేవాలయానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్నారు.